క్లుప్తంగా

వేమన పద్యాల్లో జీవిత రహస్యాలు

మహబూబ్‌నగర్ కమిటీ కార్యవర్గ సభ్యుడు నాగ్యానాయక్



వెంకిర్యాలలో ఇంటింటి ప్రచారంలో జ్ఞానవేదిక కమిటీ సభ్యులు

కొందుర్గు: వేమన పద్యాల్లో జీవిత రహస్యాలు దాగిఉన్నాయని త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక మహబూబ్‌నగర్ కమిటీ కార్యవర్గ సభ్యులు నాగ్యానాయక్ సూచించారు. ఆదివారం కొందుర్గు మండలం వెంకిర్యాల గ్రామంలో భగవద్గీత ప్రాధాన్యతను వివరించారు. అనంతరం వేమన జయంతి పురస్కరించుకొని వెంకిర్యాలలో ఇంటింటికీ తిరిగి వేమన పద్యాల విశిష్టత వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాసులు, తిరుపతయ్య, కిశోర్, విష్ణు, వెంకటేశ్, బుచ్చిలింగం, కృష్ణయ్య, అమ్ములు, పాల్గొన్నారు.

మొక్కల్లో జీవం ఉంటుంది



ఔషధ మొక్కల ప్రాధాన్యతను వివరిస్తున్న సభ్యులు

కొందుర్గు: మొక్కల్లో జీవం ఉంటుందని, మన దేశంలో దైవంతో సమానంగా పోల్చుతామని లక్ష సాధన ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. లక్ష సాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొందుర్గు శ్రీ లక్ష్మి నరసింహాస్వామి దేవాలయ ఆవరణలో 27 రకాల ఔషధ మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయ ఆవరణలో అన్ని రకాల ఔషధ మొక్కలు నాటి నక్షత్ర వనం ఏర్పాటునకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు శివస్వాములు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అంగోర్‌నాయక్

కొత్తూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పోటీల్లో కొత్తూరు పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు సైన్స్ ఉపాధ్యాయుడు భానుప్రకాశ్ తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్న పాఠశాలకు చెందిన విద్యార్థులు అభిషేక్ తివారి, ఆర్యన్‌రాజ్, ఆకాష్‌లు పలు విభాగాల్లో చక్కగా రాణించినట్లు పేర్కొన్నారు. దీంతో వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడంతో హెచ్ఎం అంగోర్‌నాయక్ వారిని అభినందించారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అక్కమొల్ల ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ బాస నర్సింహులు



పనులు చేయిస్తున్న ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ బాస నర్సింహులు

షాబాద్: మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని తాళ్లపల్లి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అక్కమొల్ల ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ బాస నర్సింహులు పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తాలోని అంబేడ్కర్, జ్యోతిరావుఫూలే, బాబుజగ్జీవన్‌రాం విగ్రహాల ఎదుట పారుతున్న డ్రైనేజీ పనులను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా డ్రైనేజీ లీక్ అయి దుర్వాసన వస్తుందని పంచాయతీ కార్యదర్శికి పలు మార్లు చెప్పిన పటించుకోలేదన్నారు. మహనీయుల విగ్రహాల ముందు నుంచి మురుగు పారుతన్న పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజ సంఘం ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో డ్రైనేజీ పనులను చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమేశ్ పంతులు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు జంగయ్య, బాల్‌రాజ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి 'సాగు'తో మేలు

- తగిర జాగ్రత్తలు తీసుకోవాలి
- అధికారుల సూచనలు పాటిస్తే దిగుబడి ఎక్కువే
- మండల వ్యవసాయాధికారి వెంకటేశం



తిమ్మారెడ్డిగూడలో సాగు చేసిన ఉల్లి

షాబాద్: 'ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదనే సామెత' వినే ఉంటాం. రోజువారి ఆహారంలో ఉల్లి లేని కూరలేదంటే నమ్మశక్యమే. ఈ క్రమంలో ఉల్లి యొక్క ఉపయోగం ఎంత ఉందో అర్థమవుతుంది. అలాగే ఉల్లి సాగు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని సాగు చేస్తే దిగుబడి అధికంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు ఉల్లి సాగుపై దృష్టి పెట్టి చేస్తే మంచి లాభాలు గడించొచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఉల్లి పంట సాగు చేసే రైతులు ఈ క్రింది సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

పంట కాలం

ఖరీఫ్‌లో ఉల్లి పంటకాలం ముఖ్యంగా మే నుంచి జులై వరకు ఉంటుంది. అక్టోబర్ నుంచి నవంబర్ కూడా పంట సాగు చేసుకునే అవకాశం ఉంది. రబీలో నవంబర్ నుంచి డిసెంబర్ వరకే సాగు చేసుకోవచ్చు.

విత్తన శుద్ధి

మూడు గ్రాముల కాప్టాన్‌లేదా థైరామ్‌ను కిలో విత్తనానికి పట్టించాలి. నారుమడిలో విత్తనాన్ని పలుచగా వరుసల్లో చల్లుకోవాలి. నారు కుళ్లు సోకకుండా 10 రోజులకు ఒకసారి కాఫర్ ఆక్సీ క్లోరైడ్ మూడు గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. నారు పెరిగే దశలో రసం పీల్చే పురుగులు ఆశించకుండా కార్బొఫ్యూరాన్ 3జీ గుళికలను నారుమడిలో చల్లి నీరు పెట్టాలి.

నారు పెంపకం..నాటే విధానం

పశువుల ఎరువులతో నేలను బాగా దున్ని 120 మీటర్ల వెడల్పు 3 మీటర్ల పొడవు ఉండేలా ఎత్తైన నారుమళ్లనుతయారు చేసుకోవాలి. 2నుంచి 2.5 కిలోల విత్తనాలను 200నుంచి 250 చదరపు మీటర్ల నారుమళ్లలో చల్లాలి. ఇది ఒక ఎకరం పొలంలో నాటడానికి సరిపోతుంది. విత్తనాలు 5 నుంచి 8 రోజుల్లో మొలకెత్తుతాయి. మురుగు నీటిని బయటికి పంపడానికి కాలువలను చేసుకోవాలి. నారుమడిలో తడి ఆరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మొలకెత్తిన 4నుంచి 5 వారాల్లో ప్రధాన పొలంనాటాలి. రెండు నుంచి మూడు సార్లు దుక్కి దున్ని పొలాన్ని చదునుచేసుకోవాలి. నారును ఒక శాతం బోర్డో మిశ్రమంలో ముంచినాటడం వల్ల తెగుళ్లు సోకకుండా ఉంటుంది.

రకాలు

బళ్లారి రెడ్: పాయలు పెద్దగా ఉండి 1–2 కలిసి ఉంటాయి. ఘాటుగా ఉంటాయి.

రాంపూర్ రెడ్: బళ్లారిరకం మాదిరిగానే ఉంటుంది.

తెల్లవి: పాయలు పెద్దవిగా ఉండి ఘాటు తక్కువగా ఉంటుంది. పంట దిగుబడి మాత్రం తక్కువ వస్తుంది.

అగ్రిఫౌండ్–డార్క్‌రెడ్

అగ్రిఫౌండ్–డార్క్‌రెడ్, అగ్రిఫౌండ్–లైట్, రెడ్ ఎన్–53 రకాలు అధిక దిగుబడినిస్తాయి. హైబ్రిడ్ రకాల్లో బెజోశీతల్‌వారి ఓరియంటల్ రకాలు ఎక్కువ సాగులో ఉన్నాయి.

నారు పోసేపద్ధతి

నారుపోయాలనుకునే స్థలాన్ని బాగా కలియ దున్నాలి. నారుకు కుళ్లు తెగుళ్లు సోకకుండా 0.5శాతం బోర్డో మిశ్రమాన్ని 10రోజులకు ఒకసారి పిచికారి చేయాలి. 45 రోజులకు నారు నాటేందుకు అనుకూలంగా ఉంటుంది. నారు తీసే ముందు ఒకసారి యూరియాను పైపాటుగా వేయాలి. మొక్క మొదట్లో కొద్దిగా ఉబ్బినట్లయితే ఆ నారు నాటడానికి సిద్ధంగా ఉన్నట్లు గమనించాలి.

నారునాటే విధానం

పొలంలో బోదెలు చేసి ఇరువైపులా 7.5సె.మీ దూరంలో గట్ల వాలు మధ్య భాగంలో నాటాలి. నల్ల నేలల్లో మధ్య దూరం 10 సెం. మీ ఉండవచ్చు. నాటే ముందు నారును 1శాతం బోర్డో మిశ్రమద్రవంలో ముంచి నాటితే మంచిది. నాటేముందు ఒక తడి ఇచ్చి నాటిన తర్వాత 10నుంచి 15 రోజులకు రెండో తడి చేసుకోవాలి.

నేల ఇలా

మూడు సార్లు పొడిగా దుక్కి దున్నాలి. హెక్టారుకు 25 టన్నుల పశువుల ఎరువు వేసి మరోసారి కలియ దున్నాలి. చదును చేసిన భూమిలో బోదెలు, గట్లు ఏర్పాటు చేసుకోవాలి. చివరి దుక్కిలో హెక్టారుకు 40 నుంచి 50కిలోల భాస్వరం ఎరువులు వేయాలి.

ఎరువుల యాజమాన్య పద్ధతి

ఎకరాకు పది టన్నుల పశువుల ఎరువుతో పాటు 60నుంచి 80 కిలోల నత్రజని, 24నుంచి 32కిలోల భాస్వరం, 24కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. వేరుశనగ పిండి లేదా ఆముదం పిండి వేసి గొర్రు తవ్వి మట్టిని ఎగదోయాలి. నత్రజనిని రెండు దఫాలుగా 30 రోజుల తర్వాత వేసుకోవాలి. నత్రజనితో పాటు పొటాష్‌ను రెండు దఫాలుగా వేసుకుంటే ఉల్లిగడ్డ బాగా ఊరుతుంది.

నీటి యాజమాన్య పద్ధతి

నారు నాటిన 60 రోజుల వరకు 12నుంచి 15 రోజుల వ్యవధిలో 4నుంచి 5తడులు చేసుకోవలి. గడ్డ ఊరే దశలో 6నుంచి 7 రోజుల వ్యవధిలో 7నుంచి 8తడులు పెట్టాలి.

అధిక దిగుబడులు సాధించొచ్చు



కోతకు పదిహేను రోజుల ముందే నీటి తడులను ఆపేస్తే ఉల్లి పంటలో అధికదిగుబడులు రావడమే కాకుండా రైతులు మంచి లాభాలు గడించొచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రతి రైతు అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని చెబుతున్నారు.

– వెంకటేశం, ఏఓ, షాబాద్

క్రీడలతో మానసికోల్లాసం



కొందుర్గు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: క్రీడలతో శారీరక ధృడత్వంతోపాటు మానసికోల్లాసం పెంపొందుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. చౌదరిగూడ మండల కేంద్రంలో ఆదివారం చౌదరిగూడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఆటలు ఆడటం వల్ల ఆరోగ్యంతో పాటు పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు. కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో యువత క్రీడలపై ఆసక్తిచూపడం అభినందనీయమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి అందరు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, చంద్రశేఖర్, నర్సింలు, ఆంజనేయులు, యాదయ్య, సత్యనారాయణ రెడ్డి, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే

షాద్‌నగర్: కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రంగంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త లక్ష్మణ్‌గౌడ్ మృతిచెందిన విషయం తెలుసుకొని ఆయన ఆదివారం వారి స్వగృహానికి వెళ్లి లక్ష్మణ్‌గౌడ్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు కాంగ్రెస్ కుటుంబ సభ్యులతో సమానమని చెప్పారు. లక్ష్మణ్‌గౌడ్ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, నర్సింలు, రమేశ్, ముబాకర్, అశోక్, బుడ్డ నర్సింహ్మా, తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మహిళలు రాజకీయంగా రాణించాలి



మాట్లాడుతున్న పామెన జ్యోతి

చేవెళ్ల: మహిళలు రాజకీయంగా రాణించాలని కాంగ్రెస్ జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ మహిళలకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. మహిళల కోసం కాంగ్రెస్ అనేక సంక్షేమ పథకాలను తీసుకురానున్నదని చెప్పారు. ఇప్పటికే ఆరు గ్యారెంటీలలో మహాలక్ష్మీ పథకం అమలులో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తోందని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంట్ స్థాయిలో పెద్ద ఎత్తున మహిళా సమావేశాన్ని ఈ నెల 10న చేవెళ్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాన్ని మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మహిళా కాంగ్రెస్ కమిటీలను ఆమె కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన మహిళా కాంగ్రెస్ కమిటీ నాయకురాళ్లు దేవర సమత, శైలజరెడ్డి, నాగమణి, అమృత, రమ్య, శ్రీరెడ్డి, ప్రత్యూషరెడ్డి, అశ్విని, సుశీల, కళఋవతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి, తోలుకట్ట, కనకమామిడి, బ్రోస్‌టౌన్ రిసార్ట్ ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ బానోతు హమునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 220 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా కేతిరెడ్డిపల్లి, తోలుకట్ట, కనకమామిడి, బ్రౌన్ టౌన్ రిసార్ట్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు. ఈ విషయంలో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి గ్రామాల శివారులోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయానికి ధర్మకర్తల మండలికి దేవాదాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి కలిగిన భక్తులు ఈ నెల 10లోపు ఉప కమిషనర్, దేవాదాయ శాఖ, హైదరాబాద్ నందు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఏఓ రవిశర్మ తెలిపారు.

ప్రశాంతంగా 'ప్రతిభ' ప్రవేశ పరీక్ష

షాద్‌నగర్ రూరల్: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల ప్రతిభ కళాశాలలో(సీఓఈ) 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రభుత్వం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించింది. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల సీఓఈ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత ఆధ్వర్యంలో సీఓఈ సెట్ నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రంలో 480 మంది విదార్థులకుగాను 449 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 31మంది గైర్హాజరయ్యారు. పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. పరీక్షా కేంద్రంవద్ద ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఓఈ పరీక్ష కేంద్రం పరిశీలకురాలు రాజేశ్వరి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది ఏర్పాటు చేయడంతో పాటు మంచినీటి వసతి కల్పించారు. దీంతో ప్రతిభ కళాశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మాడ్గుల: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముఖి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు మాడ్గుల మండలం ఇర్విన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్టుల్లో ప్రతిభ కనబర్చిన ఇర్విన్‌కి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు స్నేహిత్, జునైద్, అఫ్రాన్ రాష్ట స్థాయి పోటీలకు ఎంపికయ్యరు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్వాతాలు అభినందించారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



మౌనికను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపునకు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని అన్నారు. పార్టీ అధికారంలోకి రాలేదని నాయకులు, కార్యకర్తలు ఎవరూ నిరుత్సాహ పడకూడదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గ్రామ సర్పంచ్‌గా ఐదేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఇస్నాతి మౌనికను ఎమ్మెల్యే శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, ఇస్నాతి మచ్చేందర్, భీష్వ రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, హన్యా నాయక్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

షాద్‌నగర్ రూరల్: పట్టణంలో ఆర్టీసీ కాలనీలోని ఆంజనేయస్వామి దేవాలయం, శివాలయం, జగన్నాథ స్వామి ఆలయాల నూతన కమిటీని కాలనీ వాసులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బీజీ.రెడ్డి, అధ్యక్షుడిగా మల్చాలంమురళి, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, పరమేశ్వర్, ఆదర్శ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జయప్రకాష్ గౌడ్, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి, కార్యదర్శులుగా శ్రీనివాస్‌గౌడ్, బాలబ్రహ్మాచారి, సంయుక్త కార్యదర్శులుగా రామరాజు, సాయిరాం, ప్రచార కార్యదర్శిగా చంద్రశేఖర్, సలహాదారులుగా సాయి క్రిష్ణ, గంగిరెడ్డి, నారాయణ, విష్ణుమూర్తి, మల్లేశ్, రమేశ్, చెన్నయ్య, శరణప్ప, కెఎస్ నాథ్, సభ్యులుగా మురళిగౌడ్, నరేశ్, ఉదయ్‌కుమార్, విజయ్‌కుమార్, రఘు, సుధాకర్‌రెడ్డి, సాయికుమార్, పరమేశ్వర్, సురేష్‌గౌడ్, శివ, విఠల్, కార్తిక్‌చారి, వెంకటేశ్, భాస్కర్‌గౌడ్, సుశీల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కాలనీ, శరణబసప్ప కాలనీ, శ్రీనివాసకాలనీ వాసులు నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, సుదీర్, జగదీష్, మల్లేష్, సత్యనారాయణ, మల్లేష్, శేఖర్, ఆయా కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి

మండల ప్రధాన కార్యదర్శి రఘురాంగౌడ్



మాట్లాడుతున్న రఘురాంగౌడ్

కేశంపేట: కేంద్రంలో బీజేపీ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల ప్రధాన కార్యదర్శి రొల్లు రఘురాంగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో కార్యవర్గ సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాంగౌడ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో సబ్బండవర్గాలు అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను 'గావ్ గావ్ చలో..ఘర్ ఘర్ చలో' కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సహా విస్తారక్ శ్రీకాంత్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మోటే శ్రీనివాస్, సొప్పరి నరసింహ, లెంకపోతుల మధుసూదన్‌గౌడ్, శివాజీ, నరసింహ, వెంకటేశ్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

షాబాద్: హైతాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1994–1995 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు షాబాద్ మండల పరిధిలోని నాన్‌ధార్‌ఖాన్‌పేట్ గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. మొత్తం 42 మంది విద్యార్థులకు గాను 35మంది హాజరయ్యారని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, పద్మావతి, సుల్తానబేగం, రంగారెడ్డిలను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాణిక్యరెడ్డి, చంద్రఖర్‌రెడ్డి, విద్యాసాగర్, సత్యం, మోహన్‌రావు, యాదగిరి, కృష్ణ, రాజేందర్‌రెడ్డి, విఠల్ సుజాత, కవిత, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సహకారం మరువలేనిది



మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్, మాజీ వార్డు సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్ రూరల్: గ్రామ అభివృద్ధిలో గ్రామస్తుల సహకారం మరువలేనిదని నక్కలపల్లి మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్ అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్, మాజీ వార్డు సభ్యులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వప్నఅంజయ్యగౌడ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పాటు గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు గ్రామస్థులు కూడా కృషి చేశారని పేర్కొన్నారు. గ్రామంలో పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరు సహకరించారన్నారు. గ్రామంలో ముఖ్యంగా సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, శ్మశానవాటిక ఏర్పాటు చేసినట్లు ఆయన గుర్తు చేశారు.

సర్పంచుల పాత్ర కీలకం



మొయినాబాద్: పెద్దమంగళారంలో నరోత్తంరెడ్డిని సన్మానిస్తున్న స్నేహితులు

మొయినాబాద్: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని మొయినాబాద్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దమంగళారం సర్పంచుగా ఐదు సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కోట్ల నరోత్తంరెడ్డిని ఆదివారం ఆయన స్నేహితులు, వెంకటేశ్వరకాలనీ యువకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు అభివృద్ధిలో సర్పంచులే ముఖ్య భూమిక పోషించారన్నారు. పెద్దమంగళారం సర్పంచుగా నరోత్తంరెడ్డి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. మాజీ సర్పంచ్ నరోత్తంరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల పాటు గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండడి వెంకట్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, స్నేహితులు సత్తిరెడ్డి, సుధాకర్‌గౌడ్, కోట్ల పెంటారెడ్డి, నాగరాజు, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణ, ఉపేందర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, శ్రీశైలం, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.